వార్త

03 Nov 2024 - Page 1



# మెట్రో-2కు 24 వేల కోట్లు

## నిధులు జారీ చేస్తూ సర్కార్ ఉత్తర్వులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు2:** హైదరాబాద్‌లో మెట్రో రైలు రెండో దశ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శనివారం పరిపాలన అనుమతులు జారీ చేసింది. రెండో దశలో నిర్మించబోయే 76.4 కిలో మీటర్ల మార్గానికి 24,269 కోట్ల రూపాయలను జారీ చేస్తూ జీవో.196 పేరుతో ఉత్తర్వులు విడుదల చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో మెట్రో రైలు రెండో దశ నిర్మాణం జరుగుతుందని తెలిపిన ప్రభుత్వం, రాష్ట్ర వాటాగా రూ.7,313 కోట్లు, కేంద్రం వాటాగా 4,230 కోట్ల రూపాయలు ఉంటుందని పేర్కొంది. అలాగే జపాన్ ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ ఏజెన్సీ, న్యూడెవలప్‌మెంట్ బ్యాంకు, ఏషియన్ డెవలప్ మెంట్ బ్యాంకుల నుంచి 48 శాతం వాటాగా రూ.11,693కోట్లు, పీపీపీ పద్ధతిలో మరో 1,033 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో వెల్లడించింది. మొదటి దశలో రూ.22 వేల కోట్లతో 69 కిలో మీటర్లు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించామని, అది ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రపంచంలో నిర్మించిన అతి పెద్ద

**76.4 కి. మీ నిర్మాణానికి పరిపాలన అనుమతులు**

**కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్మాణం**

**రెండో దశలో 116.4 కి.మీ. మెట్రో మార్గం**

ప్రాజెక్టుగా తెలిపిన ప్రభుత్వం, రోజుకు 5 లక్షల మంది మెట్రో రైలులో ప్రయాణిస్తున్నట్లు వివరించింది. మొదటి దశ విస్తరణతోపాటు రెండో దశ చేపట్టే క్రమంలో నగర విస్తరణ, ట్రాఫిక్ రద్దీపై సమగ్రంగా అధ్యయనం చేశాక ప్రస్తుతమున్న మూడు కారిడార్లతోపాటు అదనంగా మరిన్ని కారిడార్లలో మెట్రో సేవలు అవసరమని ప్రభుత్వం గుర్తించినట్లు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలో మీటర్ల మార్గానికి సర్వేకు అనుగుణంగా మెట్రో రైలు రెండో దశ కారిడార్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, రెండో దశలో మొత్తం 116.4 కిలోమీటర్లు మెట్రో రైలు మార్గాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వివరించారు. అయితే అందులో మొదటగా పార్ట్ ఏ కింద 76.4 కిలోమీటర్ల మార్గానికి పరిపాలన అనుమతులు మంజూరు చేశామని, పార్ట్ బీలో నిర్మించనున్న శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 40 కిలో మీటర్ల మార్గానికి

>>2

వార్త

03 Nov 2024 - Page 2

# 24 వేల కోట్లు

>> సర్వే జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. కారిడార్ 4లో నాగోలు శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలో మీటర్లు, కారిడార్ 5లో రాయదుర్గ కోకాపేట నియోపోలీస్ వరకు 11.6 కిలో మీటర్లు, కారిడార్ 6లో ఎంజీబీఎస్ నుంచి చాంద్రయాణగుట్ట వరకు 7.5 కిలో మీటర్లు, కారిడార్ 7లో మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు 13.4 కిలో మీటర్లు, కారిడార్ 8లో ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు 7.1 కిలో మీటర్లు నిర్మించనున్నట్లు తెలిపిన సర్కార్, మెట్రో రైలు రెండో దశ పార్ట్ బీగా కారిడార్ 9లో శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీ వరకు మెట్రో రైలును అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపింది.